VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 02 ఆగష్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 04



2లో

ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# నేడు జాబ్ క్యాలెండర్ విడుదల

- శాసనసభలో ప్రకటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మళ్లీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, ఆమిర్ అలీఖాన్
- తెల్లరేషన్ కార్డుల జారీకి మంత్రివర్గ ఉప సంఘం
- రేషన్.. ఆరోగ్యశ్రీకి వేర్వేరు కార్డులు
- గౌరవెల్లి ప్రాజెక్టుకు రూ.437 కోట్లు
- మూసీలో నిత్యం గోదావరి నీళ్లు పారేలా చర్యలు
- మంత్రిమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు
- వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

హైదరాబాద్: ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తారని వెల్లడించారు. జాబ్ క్యాలెండర్‌కు చట్టబద్ధత తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. శాసనసభ సమావేశ మందిరంలో సీఎం అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం వివరాలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పొంగులేటి మీడియాకు వివరించారు. "మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం.. ఏటా నిర్దిష్ట కాలవ్యవధిలో ఉద్యోగ నియామకాలు చేపట్టేలా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శుక్రవారం శాసనసభ సాక్షిగా ఈ విషయాన్ని యావత్ తెలంగాణలోని తమ్ముళ్లు, చెల్లెమ్మలకు తెలియజేయనున్నాం. సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన తీర్పు రాగానే ముఖ్యమంత్రి శాసనసభలో ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. ఇప్పటికే నోటిఫికేషన్లు ఇచ్చిన పోస్టులకు సంబంధించి..

మిగతా 2లో





## బిఆర్ఎస్ నల్ల బ్యాడ్జీలతో నిరసన

సిఎం ఛాంబర్ ముందు బైఠాయించి ఆందోళన

అరెస్ట్ తరలించిన పోలీసులు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవమానకరంగా వ్యాఖ్యలను చేశారని నిరసిస్తూ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. సీఎం ఛాంబర్ ఎదుట ధర్నా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారు. మహిళలను అవమానపరచిన సీఎం రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో వెల్‌లో బైఠాయించగా.. మర్షల్ వారిని అసెంబ్లీ వెలుపలకు తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు వాహనంలో అసెంబ్లీ నుంచి తరలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురి సభ్యులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. శాసనసభలో విపక్షం గొంతునొక్కారన్నారు. ఎన్నిసార్లు కోరినా స్పీకర్ మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇన్ని ఆంక్షలు లేవని, తెలంగాణ ఉద్యమంలో లేని ఆంక్షలు శాసనసభలో చూడడం దురదృష్టకర మన్నారు. ఇవాళ ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిం దన్నారు. ముమ్మాటికి ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాల్సిందేనని.. అప్పటి వరకు విడిచిపెట్టేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్ అంటూ కేటీఆర్ నినదించారు. మరోవైపు శాసనసభలో మూడుగంటలుగా నిల్చొని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, కోవ లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి నిరసన తెలిపారు. సీఎం క్షమాపణలు చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# స్కిల్ యూనివర్సిటీతో కొత్త నగరం

**హెల్త్, స్పోర్ట్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తాం**

**స్కిల్ వర్సిటీ శకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**





**రంగారెడ్డి:** తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త నగరాన్ని నిర్మించనుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గత పాలకులు హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌ను నిర్మిస్తే.. బెగరికంచను నాలుగో సిటీగా ఈ ప్రభుత్వం నిర్మించనుందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని హెల్త్, స్పోర్ట్, ఇతర కంపెనీలకు హబ్‌గా మారుస్తామన్నారు. అనేక పరిశ్రమలను ఇక్కడి తీసుకొస్తామని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 57 ఎకరాల్లో రూ.150 కోట్ల వ్యయంతో వర్సిటీ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం విలువైన భూముల్ని ప్రభుత్వానికి ఇచ్చారని, ఇక్కడ వర్సిటీ నిర్మించి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తామని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి.. ఉద్యోగం కల్పించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న ప్రధాన సమస్య నిరుద్యోగమని, పట్టభద్రులైన వారిని ఈ స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా మార్చనున్నట్లు చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టుతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని, రంగారెడ్డి జిల్లాలో భూముల విలువ పెరిగిందని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్? హయాంలో ఓఆర్ఆర్ నిర్మించడం వల్లే ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయన్నారు. రైతుల త్యాగాలకు ఫలితం ఉండాలంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాట వేస్తామన్నారు. స్కిల్ యూనివర్సిటీకి భూమి ఇచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుని ప్రపంచంతో యువతతో పోటీ పడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. వృత్తి నైపుణ్యం లేకపోవడంతో పట్టాలు ఉన్నా ఉద్యోగాలు దొరకడం లేదన్న రేవంత్ దేశానికి ఆదర్శంగా నిలపాలనే ఉద్దేశంతో స్కిల్ వర్సిటీ రూపకల్పన చేసినట్టు తెలిపారు. ఏడాదికి రూ.50వేలు నామ మాత్రపు ఫీజుతో కోర్సుల శిక్షణ అందించనున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పిల్లలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా ఉచితంగా అందిస్తామని అన్నారు.



## ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు సుప్రీం ఆమోదం

ఉపకులాల వర్గీరణను సమర్థించిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉందని వెల్లడి

ఏడుగురు సభ్యుల సిజెఐ ధర్మాసనం సంచలన తీర్పు

**న్యూఢిల్లీ:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పును వెల్లడించింది. ఎస్సీల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకే అధికారం ఉందని, వారికే అవకాశం ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో చెప్పింది. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో 3 రోజుల పాటు విచారణ జరిగింది. వర్గీకరణ సమర్థనీయమేనని నాడు కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. సుదీర్ఘ వాదనల తర్వాత ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.. తాజాగా నిర్ణయాన్ని వెల్లడించింది.. విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని

మిగతా 2లో

## శ్రీశైలం ప్రాజెక్టులోకి వరదప్రవాహం

శ్రీశైలం: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద భారీగా పెరుగుతున్నది. గంట గంటకు వరద ఉధృతి మరింత పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు పది గేట్లను 15 అడుగుల వరకు ఎత్తి 3,76,670 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. దాంతో వరద నాగార్జున సాగర్ వైపు వెళ్తున్నది. జూరాలా, సుంకేశుల జలాశయాల నుంచి డ్యామ్‌కు ఇన్‌ఎ÷-లో కొనసాగుతున్నది. శ్రీశైలం జలాశయానికి ప్రస్తుతం 3,95,162 క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో ఉండగా.. అవుట్ ఎ÷-లో 4,36,902 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు.. ప్రస్తుతం జలాశయంలో 212.4385 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. కుడి, ఎడమగట్టులోని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. మరో వైపు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం పరిసరాలన్నీ పర్యాటకులతో కిక్కిరిసిపోతున్నాయి. డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు.



# వయనాడ్‌లో పర్యటించిన రాహుల్, ప్రియాంక

**ఇది ముమ్మాటికీ జాతీయ విపత్తు అన్న రాహుల్**

**వయనాడ్,:** కేరళలో సంభవించిన ప్రకృతి విపత్తు వందలాది మందిని బలి తీసుకొంది. ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. బాధితులను పరామర్శించేందుకు కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంకలు వయనాడ్ ను సందర్శించారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో పర్యటించారు. ఆయనతో పాటు ప్రియాంక గాంధీ వెళ్లారు. అక్కడ నెలకొన్న పరిస్థితి చూసి ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత భయంకరమైన విషాద ఘటన వయనాడ్‌లో చోటు చేసుకొంది. ప్రజలు తమ ఇళ్లు, కుటుంబ సభ్యులను కోల్పోవడం బాధాకరం. ఇలాంటి సమయంలో వారిని ఏ విధంగా ఓదార్చాలో తెలియడం లేదు. నా తండ్రి చనిపోయినప్పుడు ఎలా బాధపడ్డానో.. ఈరోజు అలాగే అనిపిస్తోంది అంటూ భావోద్వేగానికి గురయ్యారు. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తు. ఈ ఘటనలో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. కేరళకు జరిగిన నష్టం దేశానికి తీరని విషాదం. ఇది రాజకీయాలకు సమయం కాదు.. బాధితులందరికీ అవసరమైన సాయం అందించడానికే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి బాధితులకు రావాల్సిన సాయం అందేవరకు కాంగ్రెస్ పోరాడుతుంది. ఇలాంటి విపత్తులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దీనిపై సమగ్ర కార్యచరణ ప్రణాళిక అవసరం‘ అని రాహుల్ పేర్కొన్నారు. కాగా.. వయనాడ్‌లో ప్రకృతి సృష్టించిన విలయంలో మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు మృతుల సంఖ్య 290కి పైగా చేరుకుంది. గత మూడు రోజులుగా ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

**వయనాడ్‌లో 291కి చేరిన మృతుల సంఖ్య మరో 200 మంది గల్లంతయినట్లు వెల్లడి**

**వయనాడ్:కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి సృష్టించిన విలయంలో మృతుల సంఖ్య 291కి చేరింది. మరో 200 మంది అచూకీ గల్లంతైనట్లు అధికారులు తాజాగా అంచనా వేశారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు చెబుతున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కొండచరియలు విరిగిపడటంతో.. ముండక్కై, చూరాల్‌మల ప్రాంతాలు ఆనవాళ్లు లేకుండాపోయిన సంగతి తెలిసిందే. వందలాది గృహాలు నేలమట్టమయ్యాయి.ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బురద తొలగిస్తున్నకొద్దీ శవాలు బయపడుతున్నాయని సహాయక బృందాలు చెబుతున్నాయి. గత మూడు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.**



వేగుచుక్క
TELUGU DAILY NEWS
తెలంగాణ
2
శుక్రవారం 02 ఆగస్టు 2024

## నిరంతర విద్యుత్‌పై నిఘా ఉండాలి

### పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి

**నిజామాబాద్:** వ్యవసాయానికి 24 గంటల కరంటు అందరికీ అందుబాటులోకి వచ్చినా పలు సమస్యలు ఇంకా ఉన్నాయి. ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ పేరుతో అక్రమంగా వాడుకుంటున్న వారి పనిపట్టే చర్యలు తీసుకోవడం లేదు. వ్యయసాయం మాటున నకొందరు సొంత పనులు వెళ్లదీసుకుంటున్నారు. దీనిని పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటుకబట్టీలు ఇతరత్రా చిన్నిచన్ని పరిశ్రమల లాంటివాటి వినియోగం జరగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నోఏళ్లుగా కరెంట్ కష్టాలు అనుభవించన రైతులు ఇప్పుడు 24 గంటల నిరంతర విద్యుత్ పొందుతున్నారు. వ్యవసాయానికి కూడా నిరంతర కరెంట్ అన్నది అన్నదాతకు భరోసా ఇస్తోంది. ఇది పంటల ఉత్పత్తులను గణనీయంగా పెంచిందనడంలో సందేహం లేదు. మడిచేల్లో పడిగాపులు కాసే రోజులు పోయాయి. అవసరమున్నంత కరెంట్‌ను అవసరమున్న వేళలో ఉపయోగించుకునే వెసలుబాటు ఉన్నందున దానిపై నియంత్రణ కూడా ఉండాలి. నిరంతర కరెంట్‌ను దుర్వినియోగం చేయకుండా, దారి మళ్లించకుండా నిఘా పెట్టాలి. అప్పుడే దానికి సార్థకత వస్తుంది. నిరంతర విద్యుత్ వ్యవసాయానికి ఆలంబన కానున్న దశలో దానిని ఉచితంగా ఉపయోగించుకునేందుకు కొందరు పన్నాగాలు చేసే ప్రణాళికతో ఉంటారు.విద్యుత్ ఉద్యోగుల పాత్ర, చక్కటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. ఈ విద్యుత్ వృధా కాకుండా కేవలం వ్యవసాయానికే వాడుకుని వ్యవసాయ పంటల ఉత్పత్తులను పెంచాలి. అప్పుడే తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాలు సాధించగలదు. ప్రపంచానికి ఆదర్శం కాగలదు. సమైక్యపాలనలో మైనర్ ఇరిగేషన్ ధ్వంసం అయింది. తొమ్మిది గంటల కరంటు వచ్చిన దాఖలాలు లేనేలేవు. నాడు రెండు గంటలు కరెంటు వస్తే గొప్ప. మోటర్లు కాలిపోయేవి, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవి. ఇవన్నీ రైతన్నల అనుభవాలు. 24గంటల కరెంటు తెలంగాణ ఎంత సుస్థిరంగా ఉంటుందనేది తెలియజేస్తున్నది. మొత్తంగా వ్యవసాయం, కరెంట్ రెండూ విడదీయరాని అనుబంధం కలిగి ఉన్నాయి. కరెంట్ రావడం, నీరు లభ్యత ఉండడం అన్నది రైతుకు ఎంతో ముఖ్యం.

## ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం



**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించాలని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న మౌళిక సమస్యలను పరిష్కరించా లన్నారు. స్వచ్ఛదనం ? పచ్చదనం కార్యక్రమ నిర్వహణ పై గురువారం అన్ని జిల్లా కలెక్టర్లతో సీఎస్ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. స్వచ్ఛదనం ? పచ్చదనం కార్యక్రమం ద్వారా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడమే కాకుండా అవి మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్లలె ప్రకృతి వనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులతో పాటు ఇతర వనాల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఏవైనా ఎండిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు అరికట్టే చర్యలు, ఇంకుడు గుంతల నిర్వహణ, కొత్త ఇంకుడు గుంతల ఏర్పాట్లపై అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఇంకుడు గుంతల అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించి వాటి వివరాలను ఇప్పటికే కలెక్టర్లకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 5న ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం వంటి ఫ్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని మన రాష్ట్రంలో చాలా మంది కలెక్టర్లు యువకులే ఉన్నారని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీఎస్ సూచించారు. ప్రతి గ్రామంలో చురుకుగా ఉన్న యువజనల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ శాఖ కమిషనర్ వీపీ గౌతమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆందోళన కలిగిస్తున్న అత్యాచార ఘటనలు


### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోట చోటు చేసుకుంటున్న అత్యాచార ఘటనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా రాష్ట్రానికి హోం మంత్రి లేకపోవడం దారుణమని ఆయన మండిపడ్డారు.

తెలంగాణలో మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలను తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కేవలం 48 గంటల్లోనే నాలుగు చోట్ల సామూహిక అత్యాచారాలు చోటు చేసుకోవడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. మహిళలకు భద్రత లేకపోవడం కారణంగానే ఈ క్రూరమైన చర్యలకు దుండగులు పాల్పడుతున్నారు. ఈ వరుస ఘటనలు రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలను ఎత్తి చూపిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ, ఒక హోం మంత్రి లేకపోవడం దారుణం. హోంమంత్రి లేకపోవడం కారణంగా నేరాల సంఖ్య పెరిగిపోతుందన్నారు. వనస్థలిపురం, శాలిగౌరారం, నిర్మల్, పుప్పాలగూడలో జరిగిన ఘటనలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ వర్గీకరణకు సుప్రీం ఆమోదం



మంద కృష్ణమాదిగ భావోద్వేగానికి గురయ్యారు.. మీడియా ఎదుట కంటనీరు పెట్టుకున్న మంద కృష్ణ.. తమ 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు న్యాయాన్ని బతికించిందంటూ పేర్కొన్నారు. కోటాలో సబ్‌కోటాపై సుదీర్ఘకాలంగా కోర్టులో కేసులు ఉన్నాయి.. ఈ క్రమంలో ఉవవర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ సుప్రీంను ఆశ్రయించింది.. పంజాబ్ ప్రభుత్వం సైతం వర్గీకరణపై సుప్రీంలో కేసు వేసింది.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంలో 3 రోజులు సుదీర్ఘ వాదనలు సైతం జరిగాయి.
ఇదిలాఉంటే.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు హైదరాబాద్ మాదిగ విశ్వరూప సభలో ప్రధాని మోదీ సైతం వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని, సుప్రీం కోర్టులో కూడా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని నాడు ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

## నేడు జాబ్ క్యాలెండర్ విడుదల

సంబంధించిన దస్త్రాన్ని ఇటీవల గవర్నర్ ప్రభుత్వానికి పంపించారు. తెలంగాణ కోసం ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళ్లిన ఆచార్య కోదండరాంకు గత ప్రభుత్వం ఎంత గౌరవం ఇచ్చిందో తెలియంది కాదు. ఆయనకు సముచిత గౌరవం ఇవ్వాలని ఈ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా తిరిగి ఆయన పేరుతోపాటు గతంలో ఎంపిక చేసిన ఆమిర్ అలీఖాన్ పేరును గవర్నర్‌కు పంపాలని నిర్ణయం.

భారాస ప్రభుత్వం నిజాం షుగర్స్‌ను విస్మరించింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా ఉపసంఘాన్ని నియమించింది. సంఘం నివేదిక ప్రకారం రెండు విడతలుగా బకాయిల చెల్లింపులకు నిర్ణయం తీసుకున్నాం. ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తికి పరిశ్రమలో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చర్చించాం. ఈ అంశాన్ని కూడా ఉపసంఘానికి అప్పగిస్తూ నిర్ణయం.

హైదరాబాద్ నగర అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించింది. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటితో శామీర్‌పేట చెరువును నింపుతాం. అక్కడి నుంచి ఉస్మాన్, హిమాయత్ సాగర్‌లకు తరలించేందుకు నిర్ణయం. 15 టీఎంసీల గోదావరి జలాల్లో 10 టీఎంసీలు నగర తాగునీటికి, 5 టీఎంసీలు జంట జలాశయాలు, మూసీలో నిత్యం తాజా నీరు ప్రవహించేలా కేటాయించాలని నిర్ణయం.

ధరణి.. భూ సమస్యలపై శుక్రవారం సభలో స్వల్ప కాలిక చర్చ



నిర్వహిస్తాం. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ ఇటీవలే నివేదిక ఇచ్చింది. దీనిపై సభలో చర్చ పెట్టాలని నిర్ణయం" అని పొంగులేటి వివరించారు.

గౌరవెల్లి ప్రాజెక్టు

వరుసగా ఉద్యోగ ఎంపిక పరీక్షలు

మంత్రి పొన్నం మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్‌లో ఒకసారి షెడ్యూల్ ప్రకటిస్తే చట్ట ప్రకారం ఉద్యోగ నియామకాలు పూర్తవుతాయని అన్నారు. ఉద్యోగ ఎంపిక పరీక్షలు వరుసగా ఉంటాయన్నారు. "హుస్నాబాద్ పీఠభూమి ప్రాంతం. ఇక్కడ 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ నిర్మాణం, భూసేకరణకు రూ.437 కోట్ల కేటాయింపునకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. గతంలో భూ సేకరణను పట్టించుకోలేదు. ఎన్జీటీ కేసు, భూ సేకరణ సమస్యలు ఉన్నాయి. పనులు పూర్తయితే ఘన్‌పూర్ ప్రాంతం వరకు నీళ్లు అందుతాయి. తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించినది. దీనిలో భాగంగా నైపుణ్య విశ్వవిద్యాలయానికి సీఎం శంకుస్థాపన చేయడం శుభపరిణామం. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను పంపిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఉంటుంది. జీవో 317 సబ్ కమిటీలో నేను సభ్యుడిగా ఉన్నాను. ఇప్పటికే అన్ని శాఖల కార్యదర్శులతో సమావేశాలు జరిగాయి. త్వరలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం" అని వివరించారు.కేరళకు అండగా నిలవాలని నిర్ణయం

కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న విపత్తులో మరణించినవారి ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి మండలి సంతాపం తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వ పక్షాన బాధితులకు అండగా నిలబడాలని నిర్ణయించింది. ఆ ప్రాంతాల్లో వైద్యం, ఆర్థిక, మానవ వనరులు, యంత్రాలు తదితరాలను అందజేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆ రాష్ట్ర సీఎస్‌తో మాట్లాడి సహాయ సహకారాలు అందజేయనున్నట్లు మంత్రులు తెలిపారు. జీహెచ్ఎంసీలో కొత్తగా విలీనం చేయాల్సిన గ్రామాల అంశం మంత్రిమండలిలో చర్చకు వచ్చింది. దీనిపై మంత్రివర్గ ఉప సంఘం వేయాలని నిర్ణయమైంది. ధరణి పేరు మార్చి భూ మాతగా పెట్టాలన్న చర్చ జరిగింది. శుక్రవారం శాసనసభలో దీనిపై చర్చించాలని మంత్రిమండలి నిర్ణయించింది. రైతుభరోసా అమలు, విధి విధానాలపై చర్చ జరిగింది. ఎస్సీ వర్గీకరణ అంశమూ చర్చకు వచ్చినట్లు తెలిసింది.

## కేసీఆర్‌ను తిట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు

మైకు ఇవ్వలేదు. పార్టీ మారటం పెద్ద నేరమైతే.. ఇప్పుడు కాంగ్రెస్‌లోకి భారాస ఎమ్మెల్యేలు రాలేదా? రాహుల్ గాంధీ మిమ్మల్ని నమ్మితే మీరు ఆయన బతుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేస్తారా? నా వల్లే సీఎల్పీ పదవి పోయిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పుడు ఎస్సీ నేతకు సీఎం పదవి ఇవ్వాలని ఆయన ఎందుకు అడగలేదు? సభలో లేని ఎమ్మెల్సీ కవిత గురించి ఎందుకు ప్రస్తావించాలి? ఆడబిడ్డ అయితే.. శత్రువు కుమార్తె అయినా జాలి చూపే సమాజం మనది. మమ్మల్ని అవమానించిన తీరును రాష్ట్రమంతా గమనించింది. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో మహిళలకు భద్రత కరువైందని సబిత అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మేం ముగ్గురం మహిళా ఎమ్మెల్యేలం సభలో నిల్చొని ఉంటే.. అయ్యో పాపం అనాల్సింది పోయి.. కాంగ్రెస్ సభ్యుల ముఖాల్లో రాక్షసానందం కనిపించిందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఎనిమిది నెలలు అవుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్యం, ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన, సోనియా నాయకత్వం అని ఊదరగొడుతున్నారు. ఎన్నికలకు ముందు ప్రజా పాలన అంటే ఎలా ఉంటుందో మార్పు తీసుకొస్తారన్న నమ్మకంతో ఆడబిడ్డలందరూ కాంగ్రెస్‌కు ఓటేశారు. గ్యాస్



సబ్సిడీ, మహిళలకు నెలకు రూ. 2500 వంటి హామీలకు ఆడబిడ్డలు ఆకర్షితులై గెలిపించారు. కానీ రాష్ట్రంలో ఏం జరుగుతుంది..

రోజు ఉదయం లేస్తే ఏ టీవీలో ఏం వార్త కనిపిస్తుందో, ఏ పేపర్‌లో ఏ వార్త చదవాల్సి వస్తుందో అని అమ్మాయిల తల్లిదండ్రులు వణికిపోతున్నారు. మహిళల మీద జరుగుతున్న అత్యాచారాలపై మొన్న అసెంబ్లీలో మాట్లాడిన 48 గంటల్లోపే హైదరాబాద్ నగరంలో ఐదుగురిపై అత్యాచారం జరిగింది. కానీ ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. కనీసం ప్రభుత్వం నుంచి స్పందన లేదు అని సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు.

## విజయవంతంగా పేదలకు పెన్షన్ల పంపిణీ

### రెండోనెలలోనూ సమర్థంగా పంపిణీ పూర్తి

### హర్షం వ్యక్తం చేసిన పవన్, లోకేశ్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోంది.పింఛన్ల పంపిణీ విజయవంతంగా సాగడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పాలన ప్రారంభమయ్యాక పెంచిన సామాజిక పింఛన్లను రెండో నెలలోనూ విజయవంతంగా లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పంపిణీ చేశామని అన్నారు. 64 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు రూ.2737.4 కోట్ల మొత్తాన్ని గురువారం ఉదయం నుంచి ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించారని చెప్పారు. పేదల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రజలకు చేరువైందని వ్యాఖ్యానించారు. అందరూ హర్షించేలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రికి మనస్ఫూర్తిగా అభినందనలు అని అన్నారు. గత పాలకులు



రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేసినా సంక్షేమ పథకాల అమలుకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాకు ఆయన స్పందించారు.

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన షూటర్ స్విప్నల్ కుశాలెకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. మన దేశానికి మరో పతకం దక్కడం సంతోషాన్ని కలిగించింది. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో కాంస్యం సాధించిన యువ షూటర్ స్వప్నిల్ కుశాలెకు హృదయపూర్వక అభినందనలు. ఈ ఒలింపిక్స్ లో మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా వేకువజామునే మొదలైంది. ఎమ్మెల్యేలు, అధికారులు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. విజయవంతంగా పెన్షన్ల పంపిణీపై విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఒకటో తేదీన తెల్లవారి 6 గంటలకే పెంచిన పింఛను రూ.4000 ఇంటి వద్దే అందుకున్న అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులే తమ కూటమి ప్రభుత్వానికి దీవెనలు అని అన్నారు. పింఛన్లు అందుకున్న ఒంటరి మహిళలు, దివ్యాంగులు చెబుతున్న కృతజ్ఞతలే తమకు ఆశీస్సులు అని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందుకున్న లక్షలాదిమంది వ్యక్తం చేసిన ఆనందమే కూటమి ప్రభుత్వానికి అందిన వెలకట్టలేని బహుమానమని పేర్కొన్నారు.

## గెలిచిన వారు ..ఓడిపోయిన వారిపై పగసాధిస్తారా?

### రెడ్‌బుక్ పేరుతో వేధింపులు తగవు

### ప్రజలకు ఆశపెట్టి..అధికారంలోకి వచ్చారు

### మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

**తిరుపతి:** ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని... గెలిచినప్పుడు ఓడిపోయిన వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. 40 సంవత్సరాలు గా తాను రాజకీయాల్లో ఉన్నానని.. ఈరోజు ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయిందంటూ వ్యాఖ్యలు చేశారు.
ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఎంతటి పరాజాయాన్ని చవిచూసిందో అందరికీ తెలిసిందే. వైసీపీకి కేవలం 11 సీట్లను మాత్రమే కట్టబెట్టారు ప్రజలు. కూటమి భారీ విజయం సాధించడం.. ఆపై చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడం అంతా జరిగిపోయింది. అయితే ఎన్నికల్లో ఓటమి పాలైన అప్పటి మంత్రులు



ఏమయ్యారో అనే టాక్ నడుస్తోంది. పరాజయం తర్వాత వైసీపీ నేతలు ఒక్కరు కూడా మీడియా ముందుకు రాని పరిస్థితి. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఏపీ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడుతూ... జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు కొనసాగిస్తాను అన్న చంద్రబాబు నేడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఆశ పెట్టి...పేదల కడుపు కొట్టారని విమర్శించారు. రెడ్ బుక్ పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇన్ని పథకాలు నాశనం చేశారని.. అయినా పర్లేదు కానీ విద్య, వైద్యం పథకాల జోలికి వెళ్ళద్దని బాబు, లోకేష్, పవన్‌లకు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబును ఒక విషయంలో అభినందిస్తున్నాను...బాబు తన సామాజిక వర్గం ద్వారానే విజయం సాధించగలిగారు అని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ కులాల గురించి ప్రస్తావించ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏదో తప్పు చేశామని ప్రజల్లో తప్పుడు అభిప్రాయం వెళ్ళిందన్నారు. జగన్ కార్యకర్తలతో మాట్లాడి బలపడుతున్నారని.. ఈ రకంగా జగన్ ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చంద్రబాబు పెట్టిన బ్రాండ్లు ఇప్పుడు కొనసాగుతున్నాయన్నారు.

# ఇలా వండి తింటే బరువు పెరగరు..








అన్నం వండడం.. ఇది వండడానికి కూడా ఓ పద్ధతి ఉంటుందా అంటే ఉందంటున్నారు నిపుణులు. అదేంటో తెలుసుకోండి.
అన్నం ఇలా వండి తింటే బరువు పెరగరు.. మరెన్నో లాభాలు..
బియ్యంలో చాలా రకాలు ఉంటాయి. ఒక్కో రకానికి ఒక్కో ప్రత్యేక రుచితో పాటు పోషక విలువలు ఉంటాయి. ఈ అన్నం తింటే ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. అయితే, ఇవి మనం ఎలా వండాం.. ఎలా తిన్నామనేదానిపై కూడా ఆధారపడి ఉంటుంది. కాబట్టి, అన్నం సరిగ్గా ఎలా వండాలో కూడా తెలుసుకోండి..
అన్నం.. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అన్నం తినకూడదని అనుకుంటారు. కానీ, ఆయుర్వేద డాక్టర్ చైతాలీ రాథోడ్ ఇదే విషయంలో బరువు తగ్గడం, షుగర్, థైరాయిడ్, పిసిఓడి వంటి సమస్యలు ఉన్నప్పటికీ అన్నం తినొచ్చని చెబుతున్నారు. అందుకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.
బియ్యంలోని పోషకాలు.. అన్నం సరిగ్గా వండి తింటే బియ్యం గరిష్ఠ ప్రయోజనాలు పొందొచ్చు. అది ఎలా వండాలో సరైన పద్ధతి, అన్నం తినడం వల్ల కలిగే లాభాలు తెలుసుకోవాలి. బియ్యం కార్బోహైడ్రేట్స్‌కి మంచి మూలం. ఇవి శరీరానిక శక్తిని అందిస్తాయి. గ్లూటెన్ రహితమైనది, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, బి విటమిన్స్ వంటి అనేక ముఖ్య పోషకాలను కలిగి ఉంటుంది. అంతేకాకుండా తక్కువ సోడియం కంటెంట్ ఉంటుంది. బియ్యం ఫైబర్‌కి మూలం. జీర్ణక్రియకి హెల్ప్ అవుతుంది. రక్తంలో చక్కెరని కంట్రోల్ చేస్తుంది.
ఎలా వండాలి.. బియ్యాన్ని వండే ముందు వాటిని డ్రై రోస్ట్ చేయాలి. ఇలా రైస్‌ని స్టోర్ చేసి స్టోర్ కూడా చేస్తుంది. దీని వల్ల రుచి పెరగడమే కాకుండా స్టార్చ్ కూడా తగ్గుతుంది. అన్నం మొత్తగా కాకుండా పొడిపొడిగా వస్తుంది.
ఉడికించడం.. వేయించిన బియ్యాన్ని 1 కప్పు రైస్‌కి 4 కప్పుల నీరు పోసి 1 టేబుల్ స్పూన్ ఆవు నెయ్యి కొద్దిగా ఉప్పు వేసి ఉడికించండి. అన్నం ఉడికిన తర్వాత ఎక్కువగా ఉన్న నీటిని తీసేయాలి. వీటిని మీరు గంజిలా తాగడం, లేదా సూప్స్‌లా చేసుకోవచ్చు. అన్నాన్ని పప్పులు, కూరగాయలతో ఎంజాయ్ చేయొచ్చు.
ఇవి మరువొద్దు.. ఇలా అన్నం వండి తింటే బరువు పెరగరు. ఎలాంటి సమస్యలు రావు. అయితే, ఒక్కటి గుర్తుపెట్టుకోండి. తక్కువగా తిన్నప్పుడు మాత్రమే ఈ లాభాలు. ఎక్కువగా తింటే ఎలాంటి లాభాలు ఉండవు. ఆవు నెయ్యి కలపడం వల్ల పోషకాలు పెరుగుతాయి. కాబట్టి అస్సలు మరవకండి.

# మచ్చలు, పిగ్మెంటేషన్

ముఖంపై మచ్చలు ఉంటే చూడ్డానికి బాగోదు. అలాంటి సమస్యల్ని దూరం చేయాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.
ఎర్రకందిపప్పుని ఇలా ప్యాక్ వేస్తే ముఖంపై మచ్చలు, పిగ్మంటేషన్ మాయం..
పిగ్మంటేషన్.. దీని కారణంగా ముఖంపై మచ్చలు ఏర్పడతాయి. ఈ సమస్య రావడానికి చాలానే కారణాలు ఉన్నాయి. ఎండలో ఎక్కువగా ఉండడం వల్ల కూడా ట్యాన్ ఎక్కువగా ఏర్పడి పిగ్మంటేషన్ ఏర్పడుతుంది. ఈ సమస్య దూరమవ్వడానికి చాలా ఇంటి చిట్కాలు ఉన్నాయి. అందులో భాగంగా ఎర్ర కందిపప్పుని వాడడం వల్ల మచ్చలు, ట్యాన్ దూరమవుతుంది.
ఎర్రకందిపప్పు.. చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో ఎర్ర కందిపప్పు బాగా హెల్ప్ చేస్తుంది. ఇందులో సహజ బ్లీచింగ్ ఏజెంట్స్‌ని కలిగి ఉంటుంది. దీనిని రాయడం వల్ల ముఖంపై నల్ల మచ్చలు దూరమవుతాయి. అంతేకాకుండా మంచి రంగు కూడా వస్తుంది. దీనిని రాస్తే డార్క్ స్పాట్స్, పిగ్మంటేషన్ దూరమై స్కిన్ మెరుస్తుంది.
పాలు.. చర్మ ఆరోగ్యాన్ని కాపాడడంలో పాలు కూడా మేలు చేస్తాయి. ఇవి మంచి క్లెన్సర్ అని చెప్పొచ్చు. ఇందులో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉన్నాయి. వీటి వల్ల చర్మ రంగు మెరుగ్గా ఉంటుంది. లాక్టిక్ ఆమ్లం ఈ ప్రయోజనాన్ని అందిస్తుంది. పాలు చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.
ఏం చేయాలంటే..
ఈ రెండింటిని కలిపి ప్యాక్‌లా చేయాలంటే ముందుగా కొద్దిగా ఎర్ర కందిపప్పు తీసుకుని పాలలో నానబెట్టాలి. ఓ రెండు గంటల తర్వాత గ్రైండ్ చేయాలి. ఇది ప్యాక్‌లా తయారవుతుంది. దీనిని ముఖానికి అప్లై చేస్తే నల్ల మచ్చలు తగ్గి స్కిన్ ట్యాన్ మెరుగ్గా ఉంటుంది.





పెరుగు.. కొంత మందికి పాలు చర్మానికి సెట్ అవ్వవు. అలాంటివారు పెరుగు, మజ్జిగని కూడా వాడొచ్చు. పెరుగులోనూ బ్లీచింగ్ గుణాలు ఉన్నాయి. ఇవి కూడా చర్మ రంగు మెరుగ్గా చేసి నల్ల మచ్చలు, ట్యాన్‌ని దూరం చేస్తాయి. పెరుగులోని లాక్టిక్ యాసిడ్ ట్యాన్‌ని దూరం చేస్తుంది.

# దానిమ్మ తింటే ఈ సమస్యలు దూరం..





చూడగానే ఎర్రగా నోరూరించే పండు దానిమ్మ. ఈ పండుని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. పెరుగన్నం, సలాడ్స్, జ్యూస్ వరకూ వీటిని ఎన్నో రకాలుగా తీసుకోవచ్చు. వీటిని తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.
దానిమ్మలోని పోషకాలు.. కేలరీలు 234, ప్రోటీన్ 4.7గ్రా, కొవ్వు 3.3 గ్రా, కార్బోహైడ్రేట్స్ 52 గ్రా, ఫైబర్ 11.3 గ్రా, వీటితో పాటు విటమిన్ సి, ఫొలేట్, మెగ్నీషియం, పొటాషియంలు ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచిది. తక్కువ కేలరీలు, కొవ్వు ఎక్కువగా ఉంటాయి. ఇందులో పీచు, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. దానిమ్మ పండ్లని ఎక్కువగా తీసుకుంటే ఈ పోషకాలన్నీ అందుతాయి.
క్యాన్సర్‌ని తగ్గించే గుణాలు ఈ పండులో క్యాన్సర్‌ని నిరోధించే లక్షణాలు ఉన్నాయి. దానిమ్మ రసం తీసుకుంటే ప్రొస్టేట్ క్యాన్సర్ తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు.
గుండె సమస్యలు దూరం.. ఈ పండు తింటే గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక శారీరక సమస్యల్ని దూరం చేస్తాయి. దానిమ్మలో దీర్ఘకాలిక సమస్యలు దూరమవుతాయి. ఈ పండు తింటే బాడీలో మంట తగ్గుతుంది. దానిమ్మలో పాలీఫెనోలిక్ గుణాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దానిమ్మ పండు మూత్రపిండాల పనితీరుని మెరుగ్గా చేస్తుంది. ఇది కిడ్నీల్లో రాళ్ళ సమస్యని తగ్గిస్తుంది. కిడ్నీలో రాళ్ళ సమస్యని దూరం చేయడంలో ఈ పండు చాలా బాగా పనిచేస్తుంది. దానిమ్మ రసం రక్తంలో ఆక్సలేట్స్, కాల్షియం సాంద్రతని తగ్గిస్తుంది. ఇవి ఎక్కువగా ఉంటే కిడ్నీల్లో రాళ్ళు ఏర్పడతాయి. దానిమ్మలో ఎల్లాజిటానిన్స్ అనే యాక్సిడెంట్స్ శరీరంలోని వాపుని తగ్గిస్తాయి. ఇవి బ్రెయిన్ హెల్త్‌కి చాలా మంచిది. దీంతో అల్జీమర్స్, పార్కిన్సన్స్ సమస్యలు దూరమవుతాయి. దానిమ్మ తింట జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇందులో ప్రీబయోటిక్ అనే బ్యాక్టీరియా ఉంటుంది. అదే విధంగా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఈ పండుని అలానే తినడం చాలా మంచిది. అప్పుడే అందులోని ఫైబర్ అందుతుంది. జ్యూస్ చేస్తే అందులో షుగర్ వేయకుండా ఇవ్వాలి. హైబీపి ఉన్నవారు మెడిసిన్ తీసుకునేవారు డాక్టర్ సలహాతోనే మెడిసిన్ తీసుకోవడం చాలా ముఖ్యం.

# ఎలాంటి బిందీ మంచిదంటే..



బొట్టు.. ఇంతకుముందు కాలంలో అయితే కుంకుమ పెట్టుకునే వారు. కాలం మారేకొద్దీ ఇది ఫుల్ ట్రెండీగా మారిపోయింది. ఇందులోనే ముఖాకృతిని బట్టి ఎలాంటి స్టిక్కర్స్ ఎంచుకోవాలో ఇలా తెలుసుకోండి. వీటి వల్ల మీ ఫేస్ షేప్‌ని బట్టి చక్కని బిందీని ఎంచుకోవచ్చు.
బొట్టు.. ముఖానికి అందాన్నివ్వడంలో ఈ బొట్టు కీ రోల్ పోషిస్తుంది. నేడు మార్కెట్‌లో ఎన్నో రకాల, రంగుల ఆకారాల బిందీలు దొరుకుతున్నాయి. వీటన్నింటిని మీరు కూడా స్టైల్ చేయాలనుకుంటున్నారా. ఇక్కడ కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. మీ ఫేస్ షేప్‌ని బట్టి చక్కని బిందీని ఎంచుకోవాలి. అప్పుడే మంచి లుక్ వస్తుంది.
రౌండ్ ఫేస్ కోసం.. మీ ఫేస్ షేప్ గుండ్రంగా ఉంది. కానీ, మీరు అలాంటి గుండ్రంగా ఉండేవాటిని ఎంచుకోవద్దు. మీరు చక్కగా పొడుగ్గా ఉండే కొన్ని బిందీలు ఎంచుకోవచ్చు. దీని వల్ల మీ లుక్ ఎలివేట్ అవుతుంది. చూడ్డానికి నీట్‌గా కనిపిస్తుంది. ఈ ఫేస్ షేప్ ఉన్నవారి నుదురు, గడ్డం చదునుగా ఉంటుంది. కాబట్టి, వీరు కూడా గుండ్రంగా ఉండే వాటిని ఎంచుకుంటే నుదురు మరీ పెద్దగా అనిపిస్తుంది. కాబట్టి, చిన్న గుండ్రంగా ఉండే బిందీలు పెట్టుకోవాలి.
డైమండ్ షేప్.. వీరికి నుదురు చిన్నగా ఉంటుంది. గడ్డం, ముఖాకృతి చక్కగా ఉంటుంది. వీరు మరీ ఎక్కువగా డిజైన్స్ ఉండేవాటి కాకుండా సింపుల్‌గా ఉండే బిందీలు పెట్టుకోవడం మంచిది.. ఓవల్ షేప్ ఉన్నవారికి నుదురు, గడ్డం ఉండేవారికి పొడుగ్గా ఉండే బిందీల కంటే గుండ్రంగా ఉండే ఎలాంటి బిందీలైనా ఎంచుకోవచ్చు. వీరికి ఇవి సరిగ్గా సరిపోతాయి.
చతురస్రాకారంగా.. చతురస్రాకారం ఫేస్ షేప్ ఉన్నవారు కూడా అన్ని డిజైన్స్ కాకుండా మంచి హైలైట్‌గా ఉండే గుండ్రని, చంద్రుని ఆకారంలో ఉన్న బిందీలు పెట్టుకోవచ్చు. దీని వల్ల మీ ముఖం చూడ్డానికి చక్కగా కనిపిస్తుంది.
కొన్ని గుర్తుంచుకోవాలి.. అయితే, మ్యాచింగ్ బిందీ పెట్టుకోవడం అనేది ఇంతకు ముందు ఫ్యాషన్. ఇప్పుడు కాంట్రాస్ట్ కూడా పెట్టుకోవచ్చు. మీరు వేసుకునే డ్రెస్‌లో ఏదైనా చిన్న మ్యాచింగ్ ఉన్న కలర్ బిందీ పెట్టుకోండి. దీంతో మీ బిందీ ఎలివేట్ అవుతుంది. కాబట్టి, ఇలాంటి కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అదే విధంగా మీరు ఎప్పుడు ఒకేలా కాకుండా కొన్ని ట్రై చేస్తుండాలి. దీంతో మీకే అర్థమవుతుంది. మీకు ఎలాంటి డిజైన్స్ నచ్చుతాయో. అదే విధంగా బిందీలను కొనేటప్పుడు మంచి బ్రాండ్‌వి కొనాలి. దీంతో ఎక్కువసేపు అవి ఉంటాయి. కొన్ని బిందీలు త్వరగా ఊడిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే పౌడర్ రాయాలి. టాల్కమ్ పౌడర్, కాంపాక్ట్ పౌడర్ వంటివి రాయాలి. ఆ తర్వాత బిందీ పెట్టాలి. అప్పుడు ఆ బిందీ ఎక్కువసేపు ఉంటుంది.

# పెదవులు పగిలాయా..

శీతాకాలంలో ఎంత కేర్ తీసుకున్నా పెదవులు పగులుతూ ఉంటాయి. వాతావరణం చల్లగా ఉండటం, చలిగాలుల కారణంగా పెదవులు పొడిబారి..







పగులుతుంటాయి. విటమిన్ లోపం, శరీరంలోని తేమ శాతం తగ్గడం, పొగతాగడం, అలాగే పెదవులను తరచూ నాలుకతో తడి చేసుకుంటూ ఉండటం వల్ల కూడా పెదాలు పగులుతాయి.
పగిలిన పెదవులు తిరిగి మృదువుగా మారాలంటే.. కొన్ని ఇంటి చిట్కాలు సహాయపడతాయి.
కలబంద రాయండి.. పగిలిన పెదవులు తిరిగి మృదువుగా మారడానికి కలబంద ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. మీ పెదవులు పగిలితే.. కలబంద గుజ్జును పెదవులకు అప్లై చేయండి. దీనిలోని పాలీశీకరైడ్లు.. గాయాన్ని నయం చేస్తాయి. కలబంద గుజ్జును పెదాలకు అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాతా.. నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా రోజూ చేస్తే.. పెదవులు మృదువుగా మారతాయి.
వెన్నతో.. పెదాల పగుళ్లకు వెన్నను మించిన పరిష్కారం లేదు. సమస్య తగ్గడంతో పాటు...అధరాలు లేత గులాబీ రంగులో మెరిసిపోతాయి. చెంచా వెన్నకు చిటికెడు పంచదార యాడ్ చేసి సున్నితంగా స్క్రబ్ చేయాలి. ఇలా కాసేపు చేస్తే... రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదాలు కాంతిమంతంగా కనిపిస్తాయి. పగుళ్లు తగ్గేవరకు.. ఇలా వెన్న అప్లై చేస్తూ ఉండండి.
తేనె.. మీ పెదవులు పగిలితే.. తేనె మంచి మెడిసిన్‌లా పనిచేస్తుంది. రెండు చుక్కల తేనె తీసుకొని పెదాలపై మృదువుగా మర్దనా చేయాలి. ఇందులోని యాంటీమైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పగుళ్లు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తాయి.
కొబ్బరి నూనె..
దీన్ని రోజూ పెదాలకు రాస్తూ ఉంటే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది ఇన్‌ఫెక్షన్‌లను నివారించి, పగుళ్ల నుంచి రక్షిస్తుంది.
నువ్వులు నూనె.. నువ్వుల నూనెను కాస్త వేళ్లకు అద్దుకుని పెదాలకు రాసి, మృదువుగా మర్దన చేయండి. కాస్త జిడ్డుగా అనిపించినా కాసేపటికి పెదాలకు తగిన తేమ అంది.. సమస్య దూరమవుతుంది.

# కడుపునొప్పితో బాధపడుతున్నారా..



పిల్లలకి కడుపు నొప్పి సాధారణం. అలాంటప్పుడు కంగారు పడక కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే సమస్య తగ్గుతుంది. అవేంటో తెలుసుకోండి.
పిల్లలకి ఏదైనా సమస్యలు వస్తే తట్టుకోలేరు. అదే సమస్యని బయటికి చెప్పుకోలేరు. పిల్లలకి ఎక్కువగా కడుపు నొప్పి వస్తుంది. దీనికి చాలా కారణాలు ఉంటాయి. అజీర్ణం వంటి సమస్యల కారణంగా కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు వస్తాయి.
వాము.. కడుపునొప్పిని తగ్గించడంలో వాము కూడా చాలా మంచిది. టీ స్పూన్‌లో సగం పరిమాణంలో వాము తీసుకుని గ్లాసు నీటిలో మరిగించి తాగించండి. లేదా పొడి చేసి అంతే పరిమాణంలో మజ్జిగలో కలిపి ఇవ్వాలి.
అల్లం.. కడుపునొప్పిని దూరం చేయడంలో అల్లం బాగా పనిచేస్తుంది. చాలా మంది నిమ్మరసంతో అల్లాన్ని కలిపి తాగుతారు. అయితే, పిల్లలకి నిమ్మరసం అంత మంచిది కాదు. కాబట్టి, అల్లాన్ని మెత్తగా పేస్టు చేసి దానిని ఉండలుగా చేసి మింగేలా చూడండి. లేదా రసాన్ని తీసి కొంచెం తేనెతో కలిపి పిల్లలకి ఇవ్వొచ్చు. దీనివల్ల కడుపు నొప్పి తగ్గుతుంది. అల్లం తీసుకునేటప్పుడు అతిగా ఇవ్వకూడదు. గుండెల్లో మంట వస్తుంది.







జాజికాయ.. జాజికాయలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా జీర్న సమస్యల్ని దూరం చేయడంలో జాజికాయ హెల్ప్ చేస్తుంది. జాజికాయని వేయించి మెత్తగా పొడిచేసి కొద్ది పరిమాణంలో పిల్లలకి తేనెతో కలిపి ఇస్తే జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇలా చేస్తే పిల్లలకి విరోచనాలు, త్రేన్పులు, కడుపులో సమస్యలు దూరమవుతాయి. తేనెలో నానబెట్టిన జాజికాయ గుజ్జుని పిల్లలకి పట్టొచ్చు. తేనె వద్దనుకుంటే గోరువెచ్చని నీటిలో కలిపి ఇవ్వొచ్చు.
ఇంగువ.. ఇంగువ కూడా జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. కాబట్టి, కడుపు నొప్పి ఉంటే ఈ పొడిని వేడి నీటిలో కలిపి పిల్లల బొడ్డు చుట్టూ రాయాలి. ఇలా చేస్తే కడుపు నొప్పి తగ్గుతుంది.
ఇవి కూడా.. కొన్ని సార్లు ఆహారం పడకపోయినా కూడా జీర్ణ సమస్యలు వస్తాయి. అందుకే, త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని పిల్లలకి ఇవ్వాలి. పండ్లు, కూరగాయలు ఇవ్వాలి. అదే విధంగా, నీరు త్రాగడం, సరైన ఆహారం ఇవ్వాలి. ఇవి చేసినా కడుపునొప్పి తగ్గకపోతే వెంటనే డాక్టర్స్‌ని కలవాలి.

# మొటిమల మచ్చలు తగ్గట్లేదా..







చాలా మందికి మొటిమలు వస్తాయి. అవి వచ్చి తగ్గాక మచ్చలు పడుతుంటాయి. ఇవి అంత త్వరగా తగ్గవు. వీటిని తగ్గించే కొన్ని టిప్స్ గురించి తెలుసుకోండి. చర్మంలో సెబమ్ ఎక్కువగా రావడం వల్ల ముఖంపై మొటిమలు వస్తాయి. ఇవి వచ్చి తగ్గాక మచ్చలు మాత్రం ఓ పట్టాన పోవు. ఇవి నల్లగా మారి హైపర్ పిగ్మంటేషన్‌గా మారతాయి. వీటిని తగ్గించేందుకు కొన్ని టిప్స్ హెల్ప్ చేస్తాయి. అవేంటో తెలుసుకోండి.
దోసరసం.. కీరదోసలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. చర్మాన్ని మృదువుగా చేసి పిగ్మంటేషన్‌ని తగ్గిస్తుంది. ఇందుకోసం దోస రసాన్ని దూది సాయంతో మొటిమలు, మచ్చలపై రాస్తే మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.
కొబ్బరి నూనె.. కొబ్బరి నూనె చర్మానికి సహజమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ఇది సమస్యల్ని తగ్గిస్తుంది. మచ్చలు పోయేలా చేస్తుంది. ఇందుకోసం మచ్చలపై కొబ్బరి నూనె రాసి రాత్రంతా అలానే ఉంచి ఉదయాన్నే క్లీన్ చేయాలి.
పసుపు.. పసుపులో కూడా యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉన్నాయి. ఈ పసుపుని చర్మంపై అప్లై చేస్తే మొటిమలు, మచ్చలు తగ్గుతాయి.
తేనె.. ఇది చర్మంపై నేచురల్ మాయిశ్చరైజింగ్ లక్షణాలను కలిగి ఉంటుంది. దీనిని చర్మంపై అప్లై చేస్తే మొటిమల మచ్చలు తగ్గిపోతాయి. క్లీన్ చేసిన ముఖాన్ని తుడిచి మచ్చలపై తేనె రాయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే మచ్చల్ని తగ్గించుకోవచ్చు.
నిమ్మరసం.. నిమ్మరసంలో సహజ బ్లీచింగ్ గుణాలు ఉన్నాయి. కాబట్టి, ఇది మొండి మచ్చల్ని తగ్గిస్తుంది. సగం చెక్క నుంచి తీసిన నిమ్మరసాన్ని తీసి ఏదైనా ప్యాక్‌లా కలిపి అప్లై చేయాలి. 10 నుంచి 15 నిమిషాల పాటు చల్లని నీటితో క్లీన్ చేయాలి.
అలోవెరా జెల్... అలోవెరా జెల్ ఎన్నో వైద్య లక్షణాలను కలిగి ఉంది. ఇవి చర్మ మంటను తగ్గిస్తాయి. మొటిమలు, మచ్చల్ని తగ్గిస్తాయి. అలోవెరా జెల్ మొటిమలపై రాసి అరగంట ఉంచి చల్లని నీటితో క్లీన్ చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తే మొటిమల మచ్చలు తగ్గుతాయి.



# 11వ శతాబ్దపు రాజ్‌పుత్ యోధుడిగా రామ్ చరణ్

మూవీతో గ్లోబర్ స్టార్‌గా మారిపోయిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. తన క్రేజ్ ను కాపాడుకునేలా ప్రాజెక్ట్స్ సెట్ చేసుకుంటున్నారు మూవీతో గ్లోబర్ స్టార్ గా మారిపోయిన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.. తన క్రేజ్‌ను కాపాడుకునేలా ప్రాజెక్ట్స్ సెట్ చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఓ సినిమా కమిట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో గత రెండు రోజులుగా ఇదే టాపిక్ ట్రెండింగ్ లో ఉంది. అయితే ఈ ప్రాజెక్ట్ ను అధికారికంగా ప్రకటించకముందే ఈ సినిమా స్టోరీ లైన్ గురించి, హీరో పాత్రకు సంబంధించి అనేక వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. రామ్ చరణ్ కోసం జాన్ అబ్రహం అన్నవన్నీ మర్చిపోయాడా? రామ్ చరణ్ తో సంజయ్ లీలా భన్సాలీ చారిత్రాత్మక నేపథ్యంలో సినిమా ప్లాన్ చేస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ప్రముఖ రచయిత అమిష్ త్రిపాఠి రచించిన 'ది లెజెండ్ ఆఫ్ సుహెల్ దేవ్' అనే నవల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుందని పుకార్లు పుట్టుకొచ్చాయి. ఇందులో మెగా వారసుడు 11వ శతాబ్దానికి చెందిన ఒక పోరాట యోధుడిగా, సుహల్ దేవ్ అనే రాజ్ పుత్ చక్రవర్తిగా కనిపిస్తారని అంటున్నారు. ఉత్తర ప్రదేశ్ అవధ్ ప్రాంతంలో రాజ్ పుత్ వంశానికి చెందిన సుహేల్ దేవ్ బర్వాజ్.. శ్రావస్తి రాజ్యాన్ని పరిపాలించాడు. పదకొండో శతాబ్దంలో గజ్నవిద్ దళాలు ఉత్తర భారతదేశాన్ని ఆక్రమించడానికి దండయాత్ర చేసినప్పుడు, చొరబాటుదారులకు సుహేల్ ఎదురొడ్డి నిలిచారు. తన కొద్దిమంది సైన్యంతో ఘాజీ మసూద్ ని మట్టికరిపించారు. అలాంటి వీరోచిత గాథను ఇప్పుడు సంజయ్ లీలా తెర మీద ఆవిష్కరించబోతున్నారని, యుద్ధ వీరుడిగా చరిత్రలో నిలిచిపోయిన సహల్ దేవ్ పాత్రలో రామ్ చరణ్ కనిపిస్తారని వార్తలు వస్తున్నాయి. స్పెషల్ డే పీరియాడిక్, హిస్టారికల్ సినిమాలు తీయడంలో భన్సాలీ దిట్ట. ఆయన తెరకెక్కించిన 'రామ్ లీలా', 'బాజీరావ్ మస్తానీ', 'పద్మావత్' చిత్రాలు బాక్సాఫీసు వద్ద బ్లాక్ బస్టర్స్ గా నిలిచాయి. సుహేల్ దేవ్ కథను సినిమాగా తీయాలని ఎప్పుటి నుంచో ఎదురుచూస్తున్న దిగ్గజ దర్శకుడు.. అల్లూరి సీతారామరాజుగా నటించిన రామ్ చరణ్ ను తన కథకు తగ్గ నటుడిగా ఎంపిక చేసుకున్నారట. ఇప్పటికే చెర్రీకి స్క్రిప్ట్ నేరేట్ చేశారని, దానికి హీరో సైడ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లుగా టాక్. మొత్తానికి క్రిష్ మొదలెట్టాడు చరణ్ ప్రస్తుతం లెజెండరీ డైరెక్టర్ శంకర్ షణ్ముగం దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' అనే పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ లో నటిస్తున్నారు. దీని తర్వాత అనే వర్కింగ్ టైటిల్ తో పిలవబడుతున్న పాన్ ఇండియా మూవీలో నటిస్తారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా తెరకెక్కించనున్న ఈ సినిమా షూటింగ్ మార్చిలో ప్రారంభం కానుందని సమాచారం. ఇదే క్రమంలో సంజయ్ లీలా భన్సాలీ ప్రాజెక్ట్ ఉంటుందని, రామ్ చరణ్ బర్త్ డే స్పెషల్ గా అధికారికంగా ప్రకటించే అవకాశం వుందని నివేదికలు పేర్కొన్నాయి. ఇదే నిజమైతే మెగా ఫ్యాన్స్ కు ఇంతకంటే పెద్ద న్యూస్ ఉండదనే చెప్పాలి. ఎందుకంటే 'తుఫాన్' సినిమాతో బాలీవుడ్ లో భంగపడ్డ చెర్రీ..చిత్రంతో బాక్సాఫీస్ మీద దాడి చేశారు. రామ్ గా నార్త్ ఆడియన్స్ మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇప్పుడు ఒకవేళ సంజయ్ లీలా భన్సాలీ లాంటి అగ్ర దర్శకుడితో చారిత్రాత్మక చిత్రం చేస్తే, అది బాలీవుడ్ లో ఎన్నో సంచలనాలు సృష్టించే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ క్రేజీ ప్రాజెక్ట్ ను కన్ఫర్మ్ చేసే అనౌన్స్ మెంట్ ఏదీ రాలేదు. మరి త్వరలోనే దీనిపై క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

# రౌడీ స్టార్ ట్యాక్సీవాలాని మళ్లీ దించుతున్నాడా?



ఇప్పటికే విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో 'ట్యాక్సీవాలా' అనే సినిమా తెరకెక్కిన సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. గ్యాప్ తీసుకోకుండానే సినిమాలు కమిట్ అవుతున్నాడు. ఒకటి పూర్తి చేయడం మరో సినిమా పట్టాలెక్కించడం. ఇదే కొంత కాలంగా రౌడీబోయ్ యాక్టివిటీ. ప్రస్తుతం పరశురాంతో చేస్తోన్న ఫ్యామిలీ స్టార్ ముగింపు దశకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్ ని పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నాడు. ఆ సినిమా ఎప్పుడైనా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాల సమాచారం. ఈ సినిమా కాకుండానే విజయ్ సైన్ చేసిన మరో ప్రాజెక్ట్ కూడా ఉంది. రవి కిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విజయ్ కోసం మరో దర్శకుడు కూడా లైన్ లోకి వస్తున్నాడు. రాహుల్ సంకృత్యన్ విజయ్ కోసం ఓ స్టోరీ సిద్ధం చేసాడుట. ఇప్పటికే ఇరువురి మధ్య స్టోరీ డిస్కషన్ తంతు కూడా ముగిసిందని సమాచారం. కథ నచ్చడంతో విజయ్ కూడా నటించడానికి అంగీకరించానడని తెలిసింది. విజయ్ రొమాంటిక్ ఇమేజ్ ని బేస్ చేసుకుని రాహుల్ రాసిన స్టోరీ అని సన్నిహితుల నుంచి తెలిసింది. ఈ చిత్రాన్ని నిర్మించడానికి మైత్రీ మూవీ మేకర్స్ ముందుకొస్తుందిట. ఇప్పటికే విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్ లో 'ట్యాక్సీవాలా' అనే సినిమా తెరకెక్కిన సంగతి తెలిసిందే. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయిన ఈ సినిమా మంచి విజయం సాధించింది. 'అర్జున్ రెడ్డి'..'గీతగోవిందం' లాంటి బ్లాక్ బస్టర్లు అప్పటికే విజయ్ ఖాతాలో ఉన్నప్పటికీ 'ట్యాక్సీవాలా'పై తీవ్ర స్థాయిలో నెగిటివ్ ప్రచారం తెరపైకి వచ్చింది. అదే సమయంలో విజయ్ నీ వెనుక నేను ఉన్నానం టూ అల్లు అరవింద్ ముందుకొచ్చారు. రిలీజ్ అనంతరం ట్యాక్సీవాలా మంచి వసూళ్లని సాధించింది. ఆ తర్వాత ఇద్దరు వేర్వేరు సినిమాలు చేసారు తప్ప కలిసి పనిచేయలేదు. మళ్లీ ఇంత కాలానాకి ఆ కాంబినేషన్ చేతులు కలుపుతుంది.

# ఓ బ్యాంకు దోపిడీ

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ మూవీ ధమాకాతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన దర్శకుడు త్రినాథరావు నక్కిన ఇప్పుడు నిర్మాతగా మారారు టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ మూవీ ధమాకాతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన దర్శకుడు త్రినాథరావు నక్కిన ఇప్పుడు నిర్మాతగా మారారు. యంగ్ హీరో ఇంద్ర రామ్ కథానాయకుడిగా చౌర్య పాఠం మూవీని తెరకెక్కిస్తున్నారు. నక్కిన నెరేటివ్స్ బ్యానర్ పై నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా మేకర్స్.. ఈ సినిమా ప్రమోషన్లను ప్రారంభించారు. క్రైమ్ కమ్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతున్న చౌర్య పాఠం మూవీ ఫస్ట్ లుక్ తోపాటు టీజర్ ను రిలీజ్ చేశారు. కామెడీ, ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ తో సాగిన టీజర్.. సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఒక నవల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీ.. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గా రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. హీరో ఇంద్ర రామ్.. గ్రామంలోని ఓ బ్యాంకు దోపిడీకి తన ముఠాను సిద్ధం చేయడంతో టీజర్ ప్రారంభమవుతుంది. హీరో తన టీమ్ కు నాలుగు ముఖ్యమైన విషయాలను చెప్తాడు. 1. తామంతా డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్స్ అని గ్రామస్థులను నమ్మించేలా చేయాలి 2. వాకీ-టాకీ ద్వారా మాత్రమే కమ్యునికేట్ అవ్వాలి 3. కోడ్ భాషలో మాత్రమే మాట్లాడాలి. 4 వారి దాచిన ఆయుధాలు వారికి మాత్రమే కనిపించాలి. వీరంతా తమ ప్లాన్ ఎలా అమలు చేస్తారన్నదే మిగతా సినిమా. సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రానికి ఆసక్తికరమైన కథను అందించగా, నిఖిల్ గొల్లమారి ఎంటర్టైనింగ్ గా రూపొందించినట్లు తెలుస్తోంది. నటీనటుల క్యారెక్టర్ డిజైనింగ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తోంది. కూల్ అండ్ స్టైలిష్ గా కనిపించే ఇంద్ర రామ్ తన కామెడీ టైమింగ్ తో ఆకట్టుకున్నారు. హీరో ఫ్రెండ్స్.. తమ అమాయక చర్యలతో కామెడీ పండిస్తున్నారు. టెక్నికల్ స్టాండర్డ్స్ కూడా బాగున్నాయని నెటిజన్లు చెబుతున్నారు. కెమెరా టేకింగ్ ఎప్పటిలాగే సూపర్ గా ఉండగా, ఈగల్ ఫేమ్ దావ్‌జాంద్ తన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో ఫన్ టచ్ ఇచ్చారు. ఇక పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటించగా, రాజీవ్ కనకాల, మస్త్ అలీ, అంజి వల్లుమాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎన్. వి.ఎస్.ఎస్. సురేష్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. మరి ఈ మూవీ ఎలాంటి హిట్ కొడుతుందో చూడాలి.



# త్రివిక్రమ్ బ్లండర్‌ను బయటపెట్టిన డైరెక్టర్!



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రిలీజ్ కు ముందు ఆడియన్స్ లో భారీ అంచనాలను క్రియేట్ చేసింది. లాంగ్ గ్యాప్ తర్వాత త్రివిక్రమ్- మహేష్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ఇండస్ట్రీ వర్గాల్లోనూ సినిమాపై ఆసక్తి నెలకొంది. కానీ థియేటర్లలో రిలీజ్ అయిన తర్వాత గుంటూరు కారం మూవీకి ఆశించిన రెస్పాన్స్ రాలేదు. ఫ్యామిలీ ఆడియన్స్, మహేష్ ఫ్యాన్స్ ను తప్పితే నార్మల్ ఆడియన్స్ ను అంతగా మెప్పించలేకపోయింది. కానీ ఈ సినిమాలో మహేష్ మాస్ లుక్, క్యారెక్టరైజేషన్, డైలాగ్స్, డాన్స్.. అన్ని ఫ్యాన్స్ చేత విజిల్స్ వేయించాయి. టాక్ తో సంబంధం లేకుండా ఈ సినిమా రూ.230 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. అయితే ఈ సినిమాపై ఇటీవలే సీనియర్ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హీరోల ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని సినిమా చేస్తే దెబ్బ అయిపోతామని అన్నారు. "త్రివిక్రమ్ శ్రీనివాస్.. మహేష్ బాబు ఇమేజ్ కు తగ్గట్లుగా మూవీ చేయాలని కిందా మీదా పడ్డారు. అందువల్లే గుంటూరు కారం రిజల్ట్ అలా వచ్చింది. అదే హీరో ఇమేజ్ ను పక్కన పెట్టి.. కథపై దృష్టి పెట్టుంటే సినిమా రిజల్ట్ వేరేలా ఉంటుంది. కథను నమ్ముకుని సినిమా చేస్తే ఎప్పుడు పరాజయం అనేది ఉండదు" అని ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. "నేను కథను నమ్ముకున్నప్పుడు ఏ సినిమా కూడా ఫ్లాప్ కాలేదు. హీరోల ఇమేజ్ కు తగ్గట్లుగా మూవీ చేయాలనుకున్నప్పుడు మాత్రం దెబ్బైపోయాను. బాలకృష్ణ ఇమేజ్ కు తగ్గట్లుగా సినిమా చేయాలని ప్రయత్నించడంతో ఆ కథ పక్కకు పోయింది. అందువల్లే టాప్ హీరో సినిమా ఫ్లాప్ అయింది. హీరోకు తగ్గట్లుగా ఎప్పుడూ సినిమా చేయకూడదు. కథని కథలాగే తీయాలి. యమలీల చిత్రంలో నేను కథ గురించే ఆలోచించాను. ఇంకేమి పట్టించుకోలేదు" అని చెప్పారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్లతో 90వ దశకంలో వరుస హిట్లు అందుకున్న దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. ఆయన సినిమా అంటేనే హిట్ అనే స్థాయిలో అభిమానుల్లో అంచనాలు ఉండేవి. నాటి సినిమాలు ఇప్పటి వాళ్లకు కూడా పరిచయమే. ఫ్యామిలీ కథలను ఎస్వీ కృష్ణా రెడ్డి తీయడం, దానికి రికార్డులు బద్దలవ్వడం కామన్ గా తెలుగు ఇండస్ట్రీలో జరుగుతుండేది. ఇప్పుడు త్రివిక్రమ్ మూవీ టేకింగ్ ను కృష్ణారెడ్డి తప్పుపట్టడం టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది.

# యూత్ రిసీవ్ చేసుకుంటారా?



టాలీవుడ్ లో వరుస ఛాన్సులు దక్కించుకుంటూ దూసుకుపోతున్న బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ టాలీవుడ్ లో వరుస ఛాన్సులు దక్కించుకుంటూ దూసుకుపోతున్న బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఇటీవలే మాస్ మహారాజా రవితేజతో కలిసి ఈగల్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీంతోపాటు డీజే టిల్లు ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా రాబోతున్న టిల్లు స్క్వేర్ సినిమాతో కూడా త్వరలోనే సందడి చేయనుంది. జయం రవి, కీర్తి సురేష్ కీలక పాత్రల్లో నటించిన సైరెన్ లోనూ అనుపమ నటిస్తోంది. మరో మలయాళ సినిమా కూడా చేస్తోంది. అలా వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ అమ్మడు.. ఈగల్ మూవీతో సూపర్ హిట్ కొట్టేసింది. అందులో అనుపమ లీడ్ రోల్ పోషించి మంచి మార్కులు సంపాదించు కుంది. హీరో ఫ్లాష్ బ్యాక్ చెప్పే జర్నలిస్ట్ పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. ఇంతకుముందు అన్ని సినిమాల్లో ఫుల్ గ్లామరస్ రోల్స్ లో కనిపించిన ఈ బ్యూటీ.. ఈగల్ లో మాత్రం పూర్తిగా డీ గ్లామరస్ పాత్రలో నటించింది. అయితే ఈగల్ లో చేసిన క్యారెక్టర్ కు విరుద్ధంగా సిద్ధు టిల్లు స్క్వేర్ లో కనిపించనుంది అనుపమ. ఫుల్ గ్లామరస్ గా టీజర్ తోపాటు గ్లింప్స్ లో కనిపిస్తోంది. హీరోతో ఘాటు రొమాన్స్ చేస్తున్నట్లు పోస్టర్లలో పోజులు ఇచ్చింది. ఇటీవలే రిలీజైన టిల్లు స్క్వేర్ గ్లింప్స్ లో కూడా అనుపమ యమా స్టైలిష్ గా కనిపించింది. ఈగల్ లో మాత్రం ఫుల్ డీ గ్లామరస్ లుక్ లో నటించింది. దీంతో టిల్లు స్క్వేర్ లో నటించిన అనుపమ, ఈగల్ లో అనుమమ ఒకరేనా అని చాలా మంది నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారట. అయితే ఈగల్ సినిమాలో ఈ బ్యూటీని డీ గ్లామరస్ రోల్ లో చూసిన నెటిజన్లు.. టిల్లు స్క్వేర్ లో అనుపమను ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలని సినీ పండితులు అంటున్నారు. కానీ ఏ రోల్ అయినా అనుపమ అదరగొడుతుందని, టిల్లు స్క్వేర్ తో సూపర్ హిట్ కొడుతుందని ఫ్యాన్స్ చెబుతున్నారు. ఇక ఇటీవలే ఈగల్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చేసిన ఓ పనితో అనుపమ ఇప్పటికీ ట్రెండ్ అవుతోంది. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేనితో ఇప్పటికే నాలుగు సినిమా చేసిన అనుపమ.. ఆయనకు స్టేజ్ పైనే రాఖీ కట్టేసింది. అన్నయ్యా అంటూ పిలుస్తూ ఆత్మీయంగా హగ్ ఇచ్చింది. అయితే చాలా ఫ్రెండ్లీగా జోవియల్ గా మూవ్ అయ్యే అతి కొద్ది మంది హీరోయిన్లలో అనుపమ ఒకరు అంటూ ఫ్యాన్స్ కొనియాడుతున్నారు.





టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు మొన్న సంక్రాంతికి గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు మొన్న సంక్రాంతికి గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. టాక్ తో సంబంధం లేకుండా మహేష్ తన స్టార్ డమ్ తో గుంటూరు కారం సినిమాకు భారీగా వసూళ్లు రాబట్టిన విషయం తెల్సిందే. సోషల్ మీడియాలో అరుదుగా ఫోటోలు షేర్ చేస్తూ ఉండే మహేష్ బాబు తాజాగా వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ లవ్లీ ఫోటోను షేర్ చేశాడు.

# సూపర్ స్టార్ స్పెషల్ డే

నమ్రత తో ప్రేమలో ఉన్నప్పుడు మహేష్ బాబు తీసుకున్న ఫోటో అయ్యి ఉంటుందని చాలా మంది ఈ ఫోటోకు కామెంట్స్ చేస్తున్నారు. మహేష్ బాబుకు అప్పుడు ఎంత ఆప్యాయంగా నమ్రత ప్రేమను పంచిందో ఇప్పటికి కూడా అంతే స్పెషల్ గా మహేష్ బాబును నమత్ర చూసుకుంటూ ఉంటారు అంటూ పలు సందర్భాల్లో నిరూపితం అయ్యింది. ఇద్దరు పిల్లల తల్లిదండ్రులు అయిన మహేష్, నమ్రత ఎంతో అన్యోన్యంగా ఉంటారు. తాజాగా నమ్రతకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు చెబుతూ మహేష్ షేర్ చేసిన ఈ ఫోటో అన్ని వర్గాల వారిని ఆకర్షిస్తోంది. టాలీవుడ్ లో క్యూట్ అండ్ స్వీట్ కపుల్ జాబితాలో మహేష్ బాబు, నమ్రత జోడీ ముందు వరుసలో ఉంటారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక మహేష్ బాబు సినిమాల విషయానికి వస్తే గుంటూరు కారం తర్వాత సూపర్ స్టార్ ఇప్పటికే రాజమౌళి సినిమా కోసం రెడీ అవుతున్నాడు. ఎప్పుడూ లేనంత గడ్డంతో ప్రస్తుతం మహేష్ కనిపిస్తున్నాడు. అది కచ్చితంగా రాజమౌళి సినిమా కోసం టెస్ట్ అయ్యి ఉంటుందని కూడా టాక్ వినిపిస్తోంది. వచ్చే ఏడాదిలో మహేష్, రాజమౌళి సినిమా అవకాశాలు ఉన్నాయి.



# కొంగొత్తగా రెడీ!

హీరోలు డేట్లు దొరకకపోవడంతో హిట్ ఇచ్చిన దర్శకులు కూడా వెయిట్ చేస్తున్నారు. అలాగని కొత్త కుర్రాళ్లని యంగ్ హీరోలు లైట్ తీసుకోవడం లేదు. ఇండస్ట్రీలో హీరోలంతా ఎవరి బిజీలో వారున్నారు. కొంతమంది దర్శకుల సన్నివేశం అలాగే కనిపిస్తోంది. హీరోలు డేట్లు దొరకకపోవడంతో హిట్ ఇచ్చిన దర్శకులు కూడా వెయిట్ చేస్తున్నారు. అలాగని కొత్త కుర్రాళ్లని యంగ్ హీరోలు లైట్ తీసుకోవడం లేదు. ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతూ ఇండస్ట్రీ లో సక్సెస్ అవుతున్న నవతరం ప్రతిభని ప్రోత్సహించడానికి అంతే ఆసక్తి చూపిస్తున్నారు. నమ్మకం వచ్చిందంటే? మరో ఆలోచన లేకుండా డేట్లు కేటాయిస్తున్నారు. తాజాగా అలాంటి కాంబినేషన్స్ కొన్ని నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఓ సారి ఆ వివరాల్లోకి వెళ్తే.. యంగ్ హీరో శర్వానంద్ గతేడాది ఎలాంటి సినిమా రిలీజ్ చేయలేదు. కొత్త ఏడాదిలో మాత్రం ఫుల్ జోష్ లో కనిపిస్తున్నాడు. ఇప్పటికే శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ చిత్రాన్ని పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. అది పూర్తయిన వెంటనే రామ్ అబ్బరాజ్..కల్యాణ్ శంకర్ తో శర్వా సినిమాలు చేయడానికి రెడీ అవుతు న్నాడు. ఇదే స్పీడ్ లో వెబ్ సిరీస్ తో దర్శకుడిగా పరిచయమూన అభిలాషరెడ్డితోనూ ఓ సినిమాకి కమిట్ అయినట్లు వినిపిస్తుంది. 'లూజర్' వెబ్ సిరీస్ తో అభిలాష్ ఎంట్రీ ఇచ్చాడు. వెబ్ సిరీస్ మేకింగ్ చూసి శర్వా ఛాన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుందిట. అలాగే యూత్ స్టార్ నితిన్ కూడా ఈ మధ్య కాలంలో కొత్త వాళ్లతోనే ముందకెళ్తున్నాడు. 90 స్ వెబ్ సిరీస్ తో దర్శకుడిగా పరిచయమైన ఆదిత్య హాసన్ తో నితిన్ ఓ సినిమా చేయడానికి ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని తన సొంత నిర్మాణ సంస్థలోనే చేయాలని ప్లాన్ చేస్తున్నాడుట నితిన్. ఇప్పటికే స్టోరీ కూడా లాక్ అయిందంటున్నారు. ప్రస్తుతం నితిన్ ..వెంకీ కుడుమలతో 'రాబిన్ హుడ్' సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇక నేచురల్ స్టార్ నాని వేగం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ మధ్య కాలంలో వేగంగా సినిమాలు రిలీజ్ చేయడంలో నాని ముందుంటున్నాడు. ఇప్పటికే నాని కోసం బలంగా వేణు..శ్రీకాంత్ ఓదెల వెయిట్ చేస్తున్నారు. అలాగే సుజిత్ కూడా నానితో ఓ సినిమా చేయడానికి క్యూలో ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని డి.వి.వి.దానయ్య నిర్మించబోతున్నారుట. ఇప్పటికే స్టోరీ లాక్ అయినట్లు సమాచారం. మరోవైపు శేఖర్ కమ్ములా రానాతో సినిమా చేయాలని అంతే ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే 'లీడర్' తర్వాత మళ్లీ చేతులు కలపుతోన్న జోడీగా చెప్పొచ్చు. ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ నిర్మించడానికి ముందుకొస్తుందిట. అలాగే రానా తేజ దర్శకత్వంలో 'రాక్షస రాజ్యం 'సినిమా కూడా కమిట్ అయిన సంగతి తెలిసిందే.

# మొత్తానికి క్రిష్ మొదలెట్టాడు

ఈ సినిమా పూర్తి కావాలంటే పవన్ కళ్యాణ్ మరో 35 నుంచి 40 రోజుల కాల్ షీట్స్ ఇవ్వాలంట. అయితే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఎన్నికల బిజీలో ఉన్నారు పవన్ కళ్యాణ్ హీరోగా హరిహర వీరమల్లు సినిమాని రెండేళ్ల క్రితం డైరెక్టర్ క్రిష్ స్టార్ట్ చేశారు. అయితే ఈ సినిమా ఆరంభం నుంచి అవాంతరాలు ఎదుర్కొంటూనే ఉంది. ఈ చిత్రం కోసం పవన్ కళ్యాణ్ కాల్ షీట్స్ కేటాయించలేకపోయారో లేక ఇతర కారణాల వలన ఆలస్యం అవుతూ వచ్చిందో తెలియదు కానీ ఇప్పటికి మూవీ షూటింగ్ కంప్లీట్ కాలేదు. ఈ సినిమా పూర్తి కావాలంటే పవన్ కళ్యాణ్ మరో 35 నుంచి 40 రోజుల కాల్ షీట్స్ ఇవ్వాలంట. అయితే ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఎన్నికల బిజీలో ఉన్నారు. ఎలక్షన్స్ తర్వాత ఓజీ మూవీ కంప్లీట్ చేయాల్సి ఉంది. దాని తర్వాత హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తి చేసి హరిహర వీరమల్లుపై ఫోకస్ పెట్టే ఛాన్స్ ఉంది. ఇక రీసెంట్ గా క్రిష్ ఆ పవన్ ప్రాజెక్టు నుంచి తప్పికున్నట్లు టాక్ గట్టిగానే వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో వీరమల్లు ఉండకపోవచ్చని టాక్. ఇక క్రిష్ తన కొత్త ప్రాజెక్టుతో బిజీ అయ్యాడు. అనుష్క లీడ్ రోల్ లో ఫీమేల్ సెంట్రిక్ మూవీ ఒకటి స్టార్ట్ చేశారు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తాజాగా మూవీ సెట్స్ పైకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఎలాంటి హడావిడి లేకుండా సైలెంట్ గా ఈ చిత్రాన్ని క్రిష్ స్టార్ట్ చేసేసాడంట. మూవీ కోసం ప్రత్యేకంగా ఓ సెట్ వేశారంట. ఇందులోనే కీలక సన్నివేశాల షూటింగ్ మొదలైందని టాక్ వినిపిస్తోంది. ఉత్తరాంధ్ర బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా కథ ఉంటుందంట. అంటే దీనిని బట్టి చిత్రంలో అనుష్క పాత్ర ఉత్తరాంధ్ర స్లాంగ్ లో మాట్లాడుతుందని స్పష్టం అవుతోంది. తనకి జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఒక సాధారణ అమ్మాయిగా అనుష్క ఈ మూవీలో కనిపించబోతోందని తెలుస్తోంది. సినిమాలో ఓ యంగ్ హీరో నటిస్తున్నాడంట. అయితే అతను ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తున్నారు.